

తరుణి ఆనంద భరణి..!

సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన 'స్త్రీ శక్తి' మహిళల మోములో ఆనందాన్ని పూయిస్తుంది. ఉచిత బస్సు ప్రయాణం శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. తొలి రోజు మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని అంతగా వినియోగించుకోలేదు. జిల్లాలోని ఏడు ఆర్టీసీ బస్టాండ్‌లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళా ప్రయాణికులు తరలివచ్చారు. అయితే శనివారం సెలవు రోజు కావడం.. మరోవైపు శ్రీ కృష్ణాష్టమి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య కాస్త తగ్గినట్లైంది. ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంతో మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే.. రెగ్యులర్‌గా ప్రయాణికులు కాకుండా కొత్తగా వచ్చిన ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండుల పరంగా పరిశీలిస్తే సుమారు 80 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేయగా.. వీరిలో 22 వేల మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ఫ్రీ ప్రయాణానికి ఎంతో ఆసక్తితో మహిళా ప్రయాణికులు తరలిరావడంతో ఆయా ఆర్టీసీ ప్రాంగణాలు సందడిగా మారాయి.

- ఎక్కడ చూసినా మహిళల్లో చిరునవ్వే..
- ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికుల సందడి
- సెలవులు, పండుగ నేపథ్యంలో కాస్త తగ్గిన రద్దీ
- సీఎంపై ప్రశంసలు కురిపించిన మహిళలు
- జిల్లాలో మొదటి రోజు 22 వేల మంది ప్రయాణం

నంద్యాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుతో జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కడ చూసినా మహిళల సందడి నెలకొంది. ఏ మహిళా ప్రయాణికురాలిని కదలించినా.. ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఏడు ఆర్టీసీ బస్టాండ్‌లో చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళా ప్రయాణికులు తరలివచ్చారు. శనివారం సెలవు రోజు కావడం.. మరోవైపు శ్రీకృష్ణాష్టమి నేపథ్యంలో కాస్త ప్రయాణికుల సంఖ్య తగ్గినట్లైంది. అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు సుమారు 22 వేల మంది మహిళా ప్రయాణికులు ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారుల ద్వారా తెలిసింది. ఉచిత ప్రయాణంతో చాలా మంది ప్రయాణికులు కూటమి ప్రభుత్వంతో పాటు సీఎం చంద్రబాబునాయుడిపై ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ఎప్పటికీ సీఎం చంద్రబాబే ఉండాలంటూ దీవెనలు ఇవ్వడం గమనార్హం. ఏది ఏమైనా జిల్లా వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం సందడిగా సాగింది.


బస్టాండుల్లో మహిళా ప్రయాణికులు ఇలా..

సోమవారం నుంచి ప్రయాణికుల సంఖ్య..

శనివారం సెలవుతో శ్రీకృష్ణాష్టమి పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రోజువారీగా వచ్చే మహిళా ప్రయాణికుల కంటే.. 50శాతం మాత్రమే వచ్చారు. దీంతో ఉచిత బస్సు ప్రయాణానికి కేటాయించిన 378 బస్సుల్లో 22వేల మంది మహిళా ప్రయాణికులు వెళ్లారు. సోమవారం నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య గతం కంటే రెట్టింపు స్థాయిలో వచ్చే విధంగా కనిపిస్తోందని ఆర్టీసీ వర్గాల ద్వారా తెలిసింది.

వృద్ధులు, పేదలు ఎక్కువగా...

ఉచిత బస్సు ప్రయాణంతో మొదటి రోజు జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే.. రెగ్యులర్‌గా ప్రయాణికులు కాకుండా కొత్తగా వచ్చిన ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంది. సెలవు.. పండుగ నేపథ్యంలో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు కాకుండా ఇతర వర్గాలకు చెందిన పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు వృద్ధులు ఎక్కువగా ప్రయాణించినట్లు సమాచారం. వీరిలో చాలా మంది ప్రయాణికులు మొదటి రోజు.. బంధువులు, దేవాలయాలు, ఇతరత్రా పనుల కోసం ప్రయాణం చేసినట్లు ఆ వర్గాల నుంచి తెలిసింది.

ఎంతో ఆసక్తితో తరలిరావడంతో..

ఫ్రీ ప్రయాణంపై ఎంతో ఆసక్తితో మహిళా ప్రయాణికులు తరలిరావడంతో ఆయా ఆర్టీసీ ప్రాంగణాలు సందడిగా మారాయి. ఆ తర్వాత బస్సుల్లో కండెక్టర్లు సైతం మహిళలకు జీరో ఫేర్ టికెట్లను ఇస్తున్నారు. మహిళలు కూడా తమ గుర్తింపు కార్డులు చూపించి ఎంతో సంతోషంగా ప్రయాణం చేస్తున్నారు.

మహిళలకు వరం..



స్త్రీశక్తి పథకం మహిళలకు వరం లాంటిది. పేద, బడుగు, బలహీనవర్గాలకు ఈ పథకం ఎంతో తోడ్పడుతుంది. మైదుకూరు నుంచి చిన్నరాజుపాలెం ఉచితంగా ప్రయాణించాను. ఈపథకం తో చార్జీలు మిగిలాయి. ఆర్థికంగా వెలుసుబాటుగా ఉంది. మహిళలు చంద్రబాబుకు రుణపడి ఉంటారు.

● కుమారి, చిన్నరాజుపాలెం, బనగానపల్లె

ఆస్పత్రికి వెళ్లి వచ్చాం



మేము కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాం. నా కూతురికి అనారోగ్యంగా ఉండటంతో ఒక్క పైసా టికెట్ లేకుండా మా గ్రామం నుంచి కర్నూలులోని ఆసుపత్రికి వెళ్లి తిరిగి వచ్చాం. ఈరోజు మాకు రూ.400 మిగిలాయి. సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

● లక్ష్మీదేవి, అలేబాబ్, ప్యాపిలి మండలం

ఎంతో మేలు చేస్తుంది



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శ్రీశక్తి పథకం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది. 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు వెళ్లి చిరు ఉద్యోగాలు, పనులు చేసేవారికి చాలా మేలు చేస్తుంది. సీజనల్ టికెట్‌లు తదితర వాటిజోలికి పోకుండా ఉచితంగా నెల తరబడి ప్రయాణించి టికెట్ డబ్బులు ఆదా చేసుకోవచ్చు. నేను నా భర్త, పిల్లలతో మైదుకూరు వెళ్తున్నాను.

● శ్రీహరిత, ఆళ్లగడ్డ

మనవరాలును చూసేందుకు వెళ్తున్నా..



నా మనవరాలిని చూడబుద్ధి అయితంటే వెళ్తున్నా. రెండు నెలలుగా మనవరాలిని చూడలేదు. బస్సులో డబ్బులు లేకుండా తీసుకుపోతారంటే పోతున్నా. సీఎం బస్సులో ఉచిత ప్రయాణం పెట్టి మాలాంటి వారికి ఎంతో మేలు చేశాడు. ఇప్పుడు నా మనవరాలు లక్ష్మీదేవి గుర్తు వచ్చినప్పుడల్లా జమ్మలమడుగుకు వెళ్లి వస్తా.

● సుద్దపల్లె నాగమ్మ, ఆళ్లగడ్డ

రద్దీ కాస్త తగ్గింది..



ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కావడంతో శనివారం కాస్త రద్దీ తగ్గింది. సెలవు, పండుగ నేపథ్యంలో చాలా మంది మహిళలు రాలేదు. సోమవారం నుంచి స్త్రీ శక్తి పథకం అమలుతో గతం కంటే రెట్టింపు స్థాయిలో మహిళా ప్రయాణికులు వచ్చే అవకాశం ఉంది. శనివారం సుమారు 22వేల మంది ఉచితంగా ప్రయాణించారు.

● రజియా సుల్తానా, ఆర్ఎం, ఆర్టీసీ, నంద్యాల

ఆంజనేయ స్వామిని దర్శించుకున్నా....



ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణంతో అనంతపురం జిల్లా గుంతకల్లులోని ఆంజినేయ స్వామిని దర్శించుకున్నా. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఎప్పటి నుంచో వెళ్లాలని అనుకున్నా. కానీ కుదరలేదు. మాలాంటి వృద్ధులకు సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం వరం లాంటిది.

● సుంకలమ్మ, అలుగుండు, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా

అన్నదాత సుఖీభవతో రైతుల్లో ఆనందం

మంత్రి ఎన్ఎండీ ఫరూక్


ర్యాలీలో పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో పాల్గొన్న రైతులు


ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లువిరుస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవంలో భాగంగా నంద్యాల మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో టెక్కె మార్కెట్ యార్డు నుంచి భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతలో భాగంగా రూ.7వేలు విడుదల చేయడం ఆనందదాయకమన్నారు. జిల్లాలో 2.6 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.140 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని, రైతు ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమన్నారు. వైసీపీ పాలనలో అడుగడుగునా రైతులు దగా పడ్డారని దుయ్యబట్టారు. పంటలకు మద్దతు ధర చెల్లిస్తూనే వారి నుంచి కొన్న పంటలకు 24 గంటల్లోపే డబ్బు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చొరవతో వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని అనుసంధానించి సాగు ఖర్చులను, కూలీల కొరతను తగ్గిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంత్రి తనయుడు ఎన్ఎండీ ఫిరోజ్ ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ శ్రీనివాస సెంటర్ మీదుగా సంజీవనగర్ నుంచి పద్మావతీనగర్‌కు చేరుకుంది. ర్యాలీలో రైతులతో పాటు టీడీపీ నాయకులు మునగాల విశ్వనాథరెడ్డి, తులసీశ్వరరెడ్డి, ఇలియాస్, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ


మహానంది ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ

మహానంది, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సెలవులు రావడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా మహానందీశ్వరుని దర్శనార్థం కుటుంబ సమేతంగా వేలాది మంది తరలి వచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూలో నిల్చొని హరహర మహాదేవ శంభోశంకర అనే శివనామస్మరణతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించారు. అనంతరం నవనంది క్షేత్రాలు వినాయకనంది, గరుడనందీశ్వరుని ఆలయాలను దర్శించుకున్నారు. పరిసరాల్లోని భారీ నంది విగ్రహాన్ని తిలకించి, కుటుంబ సభ్యులతో సంతోషంగా పోటోలు తీసుకున్నారు. కాగా దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కూడా మహానందిలో భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉందన్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

పాతాళగంగలో పుణ్యస్నానాలు


దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజుల సెలవు రావడంతో శనివారం శ్రీశైల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైల పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి ఆ తర్వాత స్వామి అమ్మవార్లను దర్శికుంచున్నారు. శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులకు దేవస్థానం అధికారులు తాగునీరు, అన్న ప్రసాదవితరణ గావించారు.

సెప్టెంబరు 22 నుంచి దసరా మహోత్సవాలు




- సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- శ్రీశైల ఆలయ ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉభయ దేవాలయాల అర్చకులు, అధ్యాపక, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్వామి అమ్మవార్లకు జరిపించాల్సిన ఆయా కైంకర్యాలను, వాహనసేవలు, ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, నిజరూపాలంకరణ, రాజరాజేశ్వరి అలకంరణ, విజయదశిమి రోజున శమీపూజ, తెప్పోత్సవం, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, దర్శనం ఏర్పాట్లు, భక్తులకు అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఉత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఉత్సవాలకు సంబంధించి అధికారులకు తగు జాగ్రత్తలు తీసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు.

మీ సేవ కేంద్రాలకు **మంగళం..!** 7

తప్పుడు కేసులతో భయపెట్టలేరు
ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నీటి విడుదల పెంపు


వెలుగోడు స్పిల్ వే నుంచి విడుదల అవుతున్న నీరు

వెలుగోడు ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం నుంచి నీటి విడుదలను అధికారులు పెంచారు. స్పిల్‌వేకి చెందిన ఐదు గేట్లను తెరిచి 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి 12వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. జలాశయం మెయిన్ కెనాల్ ద్వారా 5,200 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 10వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూము ద్వారా పది, నంద్యాల తాగునీటి కోసం 20 క్యూసెక్కుల చొప్పున దిగువకు మొత్తం 15,320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 263.55 మీటర్ల వద్ద 16.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలుగుగంగ అధికారులు తెలిపారు.


డోన్‌లో కోలాటాలు ఆడుతున్న మహిళలు


ప్యాపిలిలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

సర్వం కృష్ణమయం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు



నంద్యాల కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉట్టికొట్టి చిన్నాపెద్ద సందడి చేశారు. పలుచోట్ల చిన్నారులు.. గోపాలుడు, గోపికమ్మల వేషధారణలతో ఆకట్టుకున్నారు. నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రపంచానికి గీతను బోధించి, ప్రేమతత్వాన్ని పంచిన శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలు ఉండేలా ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా చిత్తలూరి వారి వీధిలోని శ్రీకృష్ణమందిరం, పద్మావతి నగర్‌లోని కృష్ణమందిరంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలోనూ విజయం సాధించవచ్చునన్నారు. ఆయా కాలనీలు, ఆలయాల్లో సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశారు. ఉట్టికొట్టే వేడుకలతో యువకులు, చిన్నారులు కోలాహలం చేశారు.


మీర్జాపురంలో మండపంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుడు

తుంగభద్ర తీరం

సాహిత్యం

వైష్ణవాలయాల విశిష్టతను తెలిపే

ఆళ్వారుల చరిత్ర-ప్రబంధము



కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో సంక్షిప్తను కోరుకునే పాఠకులకు అనుగుణంగా మినీ కవిత, హైకూలు, నానీలు తదితర సంక్షిప్త రచనలే విస్తృతంగా కనిపిస్తుంటాయి. కానీ అందుకు భిన్నంగా, జిల్లాకు చెందిన డాక్టర్ వైష్ణవ వెంకట రమణమూర్తి ఆళ్వారుల చరిత్ర పేరుతో 300 పేజీల ప్రబంధ కావ్యాన్ని పుస్తక ప్రియుల ముందుకు తీసుకువచ్చారు. పద్య కవిత్వం ఒక పాయగా సాహిత్యంలో సాగుతూ ఈ మధ్యకాలంలో శతకాల రూపంలో సంఖ్యాపరంగా విస్తృతి సాధించింది. కానీ ప్రబంధ కావ్యాలు మాత్రం అరుదై పోయాయి. అందుకు శ్రీకారం చుడుతూ 2021లో ప్రథమ ముద్రణ పొందిన ఈ కావ్యంలో అనేక విశిష్టతలు ఉన్నాయి. పన్నెండు మంది ఆళ్వారుల చరిత్రలను కావ్య రూపంలో చెప్పడం, 33 రకాల ఛందస్సులను ఉపయోగించి పద్య రచన చేయడం, 1,054 పద్యాలతో విలసిల్లే ఈ ప్రబంధంలో ప్రామాణిక గ్రంథాలను అధ్యయనం చేసి, చరిత్రను అవలోకనం చేసి ఏ రకమైన కల్పిత ఇతివృత్తాలు లేకుండా ఆళ్వారుల చరిత్ర చెప్పారు రచయిత. పాశురాలను, స్తోత్రాలను అనువదించి పాఠకులకు అందించారు. రచయిత చిరు పరిశోధన అంటే ఎంఫిల్ ఎంఫిల్ నామదేవ, జ్ఞానదేవ, ఘోరాకుంబార్, కబీరు, జయదేవుడు మొదలైన శ్రీపాండురంగ, శ్రీరామ, శ్రీకృష్ణ భక్తుల ఇతివృత్తాలు గల నిర్వచన మహాభక్త విజయముపై జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వైష్ణవాలయాల ఉనికితో పాటు క్షేత్ర సాహిత్య చరిత్ర రాసి, 'తెలుగు సాహిత్యము కర్నూలు జిల్లాలో వైష్ణవాలయాల ప్రాశస్త్యము' పరిశోధనాంశంగా పీహెచ్‌డీ చేశారు.

ప్రబంధాలలో ఉండే కథ, కథన వైచిత్రి, పద ప్రయోగ ఔచిత్యము, రసాలంకార నిర్వహణ ఈ కావ్యంలో పుష్కలంగా ఉన్నాయి. 5 ఆశ్వాసాలు ఉన్న ఈ ప్రబంధంలో ఐదో అశ్వాసాన్ని కృష్ణాష్టమి విశిష్టాద్వైత స్థాపకులైన రామానుజాచార్యుల వారి చరిత్రను చెప్పడానికి కేటాయించారు. అధికమాసంతో కలిసి 124 ఏళ్ల జీవించిన రామానుజాచార్యుల వారి చరిత్రను 124 పద్యాలతోనే రాయడం విశేషం. అష్టాక్షరీ మంత్రాన్ని రామానుజాచార్యులు అందరికీ చెప్పే సందర్భాన్ని, ఆ తర్వాత రామానుజుల అంతరంగాన్ని తేట తెలుగులో చెప్పారు రచయిత. వైష్ణవులకు అతి ముఖ్యమైన 108 దివ్య దేశాల క్షేత్ర మహాత్మ్యాన్ని వర్ణించిన తీరు అద్భుతంగా సాగుతుంది.



- దోనెపూడి నరేష్ బాబు, పుస్తక సమీక్షకులు, నంద్యాల

నాటకమే జీవితం





'నాటకం, సినీ రంగాలు నాకు శ్వాస నిశ్వాసల్లాంటివి. మొదటిది ఉనికి, ఉన్నతిని ఇస్తే, రెండోది దాన్ని నలుదిశలా చాటుకునేలా చేస్తోంది' అంటున్నారు తిరుపతికి చెందిన రంగస్థల, సినీ, టీవీ నటీమణి డాక్టర్ డి.హసీనా జాన్. ఇంటర్ చదువుతున్నప్పుడే నాట్యం, నటన నేర్చుకొని రంగస్థలంపై ఆరంగేట్రం చేసిన ఆమె నటనకు హోసూరులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాయలసీమ నుంచి నటనలో గౌరవ డాక్టరేట్ పొందిన తొలి నటీమణి కావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు వెయ్యికి పైగా ప్రదర్శనలిచ్చిన ఆమె పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో తనదైన నటనాభివేషాలతో రాణిస్తున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. - కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

- పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో రాణిస్తున్న హసీనా
- వెయ్యికి పైగా నాటక ప్రదర్శనలు
- మూడేళ్లకే తల్లిదండ్రులు దూరం
- రాయలసీమ వ్యాప్తంగా ప్రదర్శనలు

భర్త, పిల్లల ప్రోత్సాహంతో...

2007లో నాయుడుపేటకు లతీఫ్ అబ్దుల్ కరీంతో డాక్టర్ హసీనా జాన్‌కు వివాహం జరిగింది. సంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టి నాటకాలపై ఆసక్తితో రాణిస్తున్న ఆమెకు భర్త నుంచి ప్రోత్సాహం లభించింది. దీంతో ఆమె మరింత ఉత్సాహంతో నాటకం, సినీ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు దూసుకుపోయింది. ప్రస్తుతం పిల్లలు షేక్ కాలేషా వలి పదో తరగతి, కుమార్తె జుల్ఫేకర్ ఫాతిమా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. భర్త, పిల్లల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అవకాశం కలుగుతోందని హసీనా జాన్ తెలిపారు.



హసీనాను సత్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

మూడేళ్లకే తల్లిదండ్రులను కోల్పోయి...

తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన డి.హసీనా జాన్ 1977 సెప్టెంబరు 1న జంషెడ్‌పూర్ (టాటానగర్)లో జన్మించారు. తల్లిదండ్రులు మెమోలా జాన్, షేక్ ఖాదర్‌వలీ బాషా ఇద్దరూ టాటానగర్‌లో ఉద్యోగాలు చేసేవారు. వెంకటగిరిలో జన్మించిన ఆమె తల్లి మెమోలా జాన్ వృత్తిరీత్యా వైద్యురాలిగా ఉంటూ, ఉన్నత విద్యకై టాటానగర్ వెళ్లారు. అక్కడ షేక్ ఖాదర్‌వలీ బాషాతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి వారి వివాహానికి దారితీసింది. దీంతో హసీనా జాన్ వారికి ఏకైక సంతానంగా అక్కడే జన్మించారు. ఎంతో అన్యోన్యంగా, సుఖ సంతోషాలతో సాగిపోతున్న వారి జీవితాలను విధి రక్కసి కాటేసింది. ఒక రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు ఇద్దరు మరణించగా, ప్రాణాపాయ స్థితిలో బతికి బయటపడ్డ మూడేళ్ల హసీనా జాన్‌కు వెంకటగిరిలో ఉంటున్న అమ్మమ్మ షేక్ హమీదా బీ, తాతయ్య షేక్ ఖాలేషా దిక్కయ్యారు. వారే హసీనాను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించారు. తాతయ్య వృత్తిరీత్యా రైల్వే ఉద్యోగి కావడంతో కుటుంబాన్ని వెంకటగిరిలోనే పెట్టి వృత్తిపరంగా వివిధ ప్రాంతాల్లో ఆయన పనిచేసేవారు. వెంకటగిరిలో పది పూర్తిచేసిన హసీనా ఇంటర్ విద్యకు తిరుపతి పద్మావతి జూనియర్ కళాశాల్లో చేరింది. అక్కడే భరతనాట్యం నేర్చుకుంది. అక్కడే కళాశాల స్థాయిలో నాటకాలు వేయడం ప్రారంభించింది. అమ్మమ్మ మెమోలా జాన్‌కు కళల పట్ల ఆసక్తి ఉండటంతో నాటక, నృత్య రంగాల్లో బాగా ప్రోత్సహించింది. అలా తిరుపతిలో 'పృథ్వీ-సంయుక్త' చారిత్రక నాటకం, 'ఓలి' సాంఘిక నాటకం, 'అన్నమయ్య' పౌరాణిక నాటకాలలో తొలిసారిగా పాత్రల్లో మెప్పించింది. దీంతో ఇక ఆమె వెనుదిరిగి చూసుకోలేదు.

అవార్డులు..రివార్డులు ఆమె సొంతం

తమిళనాడులోని హోసూరులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ 2025 ఏప్రిల్ 2న హసీనా జాన్‌కు 'గౌరవ డాక్టరేట్'ను ప్రదానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాటక రంగంలో విభిన్న పాత్రలతో రాణిస్తున్న ఆమెను గురించి ఈ డాక్టరేట్ డిగ్రీని ఆమెకు అందజేశారు. అలాగే 2015లో ఆమెకు పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో 'కందుకూరి' విశిష్ట పురస్కారం అందజేశారు. 2025 మార్చి 16న హైదరాబాదులోని సర్ సీవీ రామన్ అకాడమీ 'రంగస్థల మహిళారత్న' పురస్కారం ప్రదానం చేశారు. అలాగే ఆమె నటించిన బభ్రువాహన విజయం, శ్రీకృష్ణ కమలపాలిక, శ్రీకృష్ణార్జున యుద్ధం, సై సైరా నరసింహారెడ్డి తదితర నాటకాలకు నంది అవార్డులు లభించాయి. తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆమెకు ఉచిత హాస్యనటి అవార్డుతో సత్కరించారు.



చంద్రబాబు నుంచి అవార్డును స్వీకరిస్తున్న బృందంలో హసీనా

3 దశాబ్దాలుగా నాటకరంగంలోనే...

గత 30 ఏళ్లుగా నాటక రంగంలో అనేక పాత్రలు పోషించి మెప్పించిన డాక్టర్ హసీనా జాన్‌ను తిరుపతిలోని నాటక దర్శకుడు ప్రకాశ్ రాజ్, సుందర్ బాబు, కేఎన్ రాజా, పల్లేటి లక్ష్మీకులశేఖర్, భరద్వాజ్, టీడీపీ మాజీ ఎంపీ దివంగత శివప్రసాద్‌లతో పాటు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య ప్రోత్సాహకాలు అందించారు. వివిధ నాటకాల్లో హసీనాకు మంచి పాత్రలు ఇచ్చి ఆమె ఎదుగుదలకు కృషి చేశారు. సినిమా రంగంలోనూ హసీనాజాన్‌కు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. ప్రముఖ నటుడు మోహన్‌బాబు నిర్మించిన 'గాయత్రి' వెబ్ సిరీస్‌తోపాటూ బీఎన్ రెడ్డి తీసిన 'నీతోనే హాయ్ హాయ్', టీవీ సీరియళ్లు తలంబ్రాలు, జయం, నిన్నే పెళ్లాడతా, కల్యాణి తదితర వాటిల్లో ముఖ్య భూమికలు పోషించారు.

కళాకారులను ప్రత్యేకంగా గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం రంగస్థల కళాకారులను ప్రత్యేకంగా గుర్తించాలి. గుర్తింపు కార్డులు జారీ చేసి బస్సులు, రైళ్లలో ప్రత్యేక రాయితీలు కల్పించాలి. నిత్యం వివిధ ప్రాంతాలకు నటించేందుకు వెళ్లే వారికి ఇది కొంత ఆర్థిక భారం తగ్గినట్లు అవుతుంది. అలాగే జిల్లా కేంద్రాల్లో కళాకారులకు ప్రత్యేక కాలనీలు నిర్మించాలి. వృద్ధ కళాకారులకు పింఛన్లు కూడా పెంచి ఇవ్వడంతో పాటు వివిధ ప్రైవేటు, కార్పొరేట్ వైద్యాశాలల్లో చికిత్సలకు రాయితీలు కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో నాటకం, నటన అంశాలపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, యువతకు కళారంగంలో శిక్షణ కల్పించాలి. - హసీనా జాన్

శ్రీశైల భ్రమరాంబ దేవికి బంగారు హారం



తుగ్గలి నాగేంద్ర దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈవో




బంగారు హారం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైలంలోని భ్రమరాంబదేవికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, వరలక్ష్మి దంపతులు రూ.11 లక్షల విలువైన కాసులపేర (బంగారునగ)ను సమర్పించారు. ముందు గా దాతకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా 100 గ్రాముల బరువున్న కాసుల పేరను ఆలయ ఈఓ శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్న దాతలను ఆలయ వేదాశీర్వచన మండపంలో ఈఓతో పాటు వేదపండితులు గంటి రాధకృష్ణమూర్తి, ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున స్వామివారి జ్ఞాపిక, అమ్మవార్ల శేష వస్త్రాలను ఇచ్చి సత్కరించారు.

బొమ్మ పోయింది.. రాజముద్ర వచ్చింది

- రీసర్వే గ్రామాలకు 2,287 పాసు పుస్తకాలు



నేడు రాజముద్రతో ఉన్న పాసు పుస్తకం



నాడు జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకం

మద్దికెర ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భూమి రైతుది.. దాని పట్టాదారు పాసు పుస్తకమూ రైతుదే.. కానీ దానిపై ఫోటో మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది.. దీంతో తమ పాసు పుస్తకంపై జగన్ బొమ్మ ముద్రించడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్త చేశారు. జగన్ బొమ్మతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందించారు. పాసు పుస్తకం చూసిన ప్పుడల్లా రైతులు ఆగ్రహించేవారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వైఎస్ జగన్ బొమ్మ పోయి రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలు వస్తున్నాయి. మండలంలోని హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయింది. అప్పట్లో భూమి వివరాలతో కూడిన పాసు పుస్తకాలు ఇచ్చారు. దీనిపై రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి ప్రభుత్వం కొద్దిరోజుల పాటు నిలిపివేసింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాసు పుస్తకాలపైన ఎటువంటి బొమ్మలు ప్రచురించలేదు. పాసు పుస్తకాలపై గౌరవప్రదంగా రాజముద్ర వేయించి రెవెన్యూ కార్యాలయానికి పంపారు. రీసర్వే చేసిన హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాలకు 2,287 పాసు పుస్తకాలు వచ్చాయని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. ప్రస్తుతం బురుజుల, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన పాసు పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలను పంపిణీ చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జశ్వంత్ జైత్రయాత్ర

- బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న యువ క్రీడాకారుడు
- ఆలిండియాలో అండర్-13లో మొదటి ర్యాంక్
- ఏడేళ్ల వయస్సుకే రాకెట్ పట్టి సాధన
- కోచ్ నాగార్జున శిక్షణలో మెలకువలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం
- ఆరుసార్లు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు
- అభినందించిన ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు

నంద్యాల హస్పిటల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంకితభావం, కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చనే దానికి నిదర్శనం యువ క్రీడాకారుడు జశ్వంత్. నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. జశ్వంత్ విజయం క్రీడాకారులందరికీ ఆదర్శం. జాతీయ బ్యాడ్మింటన్‌లో నంద్యాలకి చెందిన మహంకాళి జశ్వంత్ జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. అఖిలభారత ర్యాంకింగ్ టోర్నీలో బంగారు పతకం కైవసం చేసుకొని అండర్-13 బాలుర విభాగంలో నెంబర్1 ర్యాంక్‌ను సాధించి నంద్యాల కీర్తిపతాకాన్ని ఎగురవేశాడు.

నంది ఫైవ్స్ బ్యాడ్మింటన్ అకాడమిలో..

పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రాజీవ్, గౌతమిల కుమారుడు జశ్వంత్ బ్యాడ్మింటన్‌పై ఇష్టంతో ఏడేళ్ల వయసు నుంచే రాకెట్ పట్టుకొని నందిఫైవ్స్ బాడ్మింటన్ అకాడమిలో సాధన చేశాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ నాగార్జున శిక్షణలో అతడు జాతీయ స్థాయిలో నెంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్నప్పటి నుంచి కఠోర సాధన చేసి మెలకువలు నేర్చుకొని ప్రస్తుతం అండర్-13 సింగిల్స్ విభాగంలో ఎదురులేని క్రీడాకారుడిగా అందరి మన్ననలు పొందుతున్నాడు.

కఠోర శిక్షణకు ఫలితంగా..

2023లో కోల్‌కతాలో జరిగిన అండర్-13 జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించడంతో బెంగళూరులోని ప్రకాష్‌పదుకొనె బాడ్మింటన్ అకాడమిలో శిక్షణ పొందేందుకు అర్హత సాధించాడు. అక్కడ చేసిన కఠోర శిక్షణకు ఫలితంగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో నెంబర్1 స్థానానికి ఎదిగాడు. ఇప్పటివరకు ఆరుసార్లు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధించాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించి అందరి దృష్టిలో పడ్డాడు.

ఉత్కంఠ భరితంగా సాగి ఫైనల్ పోటీలో ..

కోల్‌కతాలో ఈ నెల 9నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఆలిండియా సబ్ జూనియర్ జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో జశ్వంత్ అండర్-13విభాగంలో అద్భుతంగా ఆడి స్వర్ణపతకం సాధించాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో హర్యానా రాష్ట్రానికి చెందిన రెండవ ర్యాంకర్ స్లోక్ చౌదరి రాయ్‌పై 19-21, 21-19, 21-16స్కోర్ తేడాతో జశ్వంత్ గెలుపొందాడు. అతడికి బంగారు పతకం, ట్రోఫీతోపాటు రూ.72వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. జశ్వంత్ విజయంపై ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ద్వారకనాథ్, కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా కార్యదర్శి వంశీధర్, నంది బ్యాడ్మింటన్ శిక్షకుడు నాగార్జున ప్రత్యేకంగా అభినందించారు.



ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో ఆడుతున్న జశ్వంత్ (ఫైల్)



సాధించిన కప్పు, మెడల్‌తో జశ్వంత్ (ఫైల్)

సంతోషంగా ఉంది

జాతీయ స్థాయిలో నెంబర్ 1 ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. నందిఫైవ్స్ బాడ్మింటన్ అకాడమి ప్రోత్సాహంతో ఈస్థాయికి ఎదిగాను. కోచ్ నాగార్జున, బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వంశీధర్ ప్రోత్సాహంతో బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నా. భవిష్యత్తులో బాడ్మింటన్‌లో మరింత నైపుణ్యం సాధించి అంతర్జాతీయ పోటీలకు వెళ్తా.

- జశ్వంత్, క్రీడాకారుడు



కోల్‌కత్తాలో బంగారు పతకం, నగదు పురస్కారం అందుకుంటున్న జశ్వంత్

సుంకేసుల గేట్ల మరమ్మతులను పరిశీలించిన ఎస్ఈ



సుంకేసుల బ్యారేజీ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ డీఈఈ ప్రసాద్‌రావు తదితరులు

కర్నూలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల బ్యారేజీ గేట్ల మరమ్మతు పనులను జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ డీఈఈ ప్రసాద్‌రావు, ఏఈఈ మహేంద్రనాథ్‌లు శనివారం పరిశీలించారు. బ్యారేజీ సామర్థ్యం 1.20 టీఎంసీలు. ఎగువ తుంగభద్ర జలాశయం నుంచి 34 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఏడు గేట్లు ఒక మీటరు చొప్పున ఎత్తి 30,653 క్యూసెక్కులు దిగువన శ్రీశైలం డ్యాంకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు సాగు, కర్నూలు నగర తాగునీటి అవసరాల కోసం కేసీ కాలువకు 2,180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. డ్యాం నిర్వహణ నిధులు రూ.30 లక్షలతో గేట్ల మరమ్మతులు చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి 50వేల క్యూసెక్కులు వరద విడుదల చేసే అవకాశం ఉండడంతో గేట్ల తాజా పరిస్థితిని ఎస్ఈ, డీఈఈలు పరిశీలించారు. వరదను అంచనా వేశారు. తక్షణమే గేట్లు మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఎగువ నుంచి 28,721 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు గాకా.. నిపుణుల సూచన మేరకు 1625.06 అడుగుల్లో 80 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను 22,190 క్యూసెక్కులు దిగువ నదికి, 6,531 క్యూసెక్కులు వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద పెరుగుతోందని, ఆదివారం ఉదయానికి 50వేల క్యూసెక్కులు చేరే అవకాశం ఉందని తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

మీ సేవ కేంద్రాలకు మంగళం..!

- జగన్ సచివాలయ వ్యవస్థతో కుదేలు
- కూటమి వాట్సప్ గవర్నెన్స్‌తో ఆందోళన
- అమలుకు నోచుకోని ఐటీ మంత్రి లోకేశ్ హామీ
- రోడ్డున పడనున్న 10వేల కుటుంబాలు

వైసీపీ అధికారంలోకి వచ్చేంతవరకు ఓ వెలుగు వెలిగి ప్రజలకు సుదీర్ఘ కాలం సేవలందించిన మీ సేవ కేంద్రాల మాట ఇక మర్చిపో వాల్సిందే. జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో వీటికి చెక్ పడింది. ఫలితంగా మీసేవ కేంద్రాల నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరగా మారనుంది. సుమారు పది వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.



సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న నిర్వాహకులు(ఫైల్)

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సేవలందించిన మీ సేవ కేంద్రాలకు మంగళం పలకడంతో వాటి నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరకపోవడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో మీ సేవల నడ్డివిరిచారు. ప్రస్తుతం అధికారంలోకి రాగానే మీ సేవాకేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ప్రకటించారు. అందుకనుగుణంగానే అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ అమలుకు నోచుకోక పోవడంపట్ల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చేంతవరకు ఓ వెలుగు వెలిగిన మీ సేవా కేంద్రాలకు జగన్ చెక్ పెట్టాడు. మీ సేవ అందించే సర్వీసులన్నీ సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామని చెప్పి తర్వాత రుసుం వసూలు ప్రారంభించారు. మీ సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ అప్పట్లో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో ప్రచారం జరిగింది. దీంతో ప్రజలు సచివాలయాలనే ఆశ్రయించారు. రాష్ట్రంలో 2019లో 11వేలకుపైగా మీసేవ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటి ద్వారా రెవెన్యూ, ఏపీఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర శాఖలకు చెందిన దాదాపు 360 సర్వీసులు ప్రజలకు అందించేవారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుంలో కొంతభాగం కమీషన్ రూపంలో మీ సేవ నిర్వాహకులకు దక్కేది. దీంతో పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాదికుటుంబాలు జీవనం సాగించేవి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సేవలకు మహర్దశ వస్తుందని ఆశించిన నిర్వాహకులకు నిరాశనే మిగిలింది.

గతంలో మీ సేవ నిర్వాహకులకు సంఘీభావం తెలిపిన నారా లోకేశ్ రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు మీ సేవలకు సర్వీసులు పునరుద్ధరించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు సులభతరమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇటీవల ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించారు. దీంతో మీ సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10వేల మీసేవ నిర్వాహకుల కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మంత్రి లోకేశ్ ప్రకటించినప్పటికీ రాష్ట్ర స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు మీ సేవల పునరుద్ధరణపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవచూపి మీ సేవా కేంద్రాల భవితవ్యంపై సముచిత నిర్ణయం తీసుకుని మీ సేవ కేంద్రాలకు సర్వీసులు పునరుద్ధరించాలి.

మీ సేవ కేంద్రాలను ఆదుకోవాలి



మీ సేవ కేంద్రాలను ప్రభుత్వం ఆదుకోవాలి. మంత్రి నారా లోకేశ్ హామీని అమలుపరచాలి. అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు స్వయంగా భరిస్తూ కేంద్రాలు నడుపుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిస్తున్నా. **- కళ్యాణ్‌కుమార్ అధ్యక్షుడు, మీ సేవ కేంద్రాల అసోసియేషన్, నంద్యాల జిల్లా**

పోక్సో కేసు నమోదు



మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాస్

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఓ బాలిక గర్భందాల్చి మగ శిశువుకు జన్మనివ్వడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ నందివర్గం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఓ గ్రామంలో పదో తరగతి చదువుతున్న 17 సంవత్సరాల వయస్సుగల ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేశాడన్నారు. ఆ బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఆ బాలిక గర్భందాల్చినట్లు గుర్తించారన్నారు. ఆ బాలిక ఓ మగ శిశువుకు జన్మనిచ్చిందన్నారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాధితురాలి గ్రామానికి వెళ్లి పూర్తి స్థాయిలో విచారించామన్నారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- కంది పంటను దున్నేసిన ఓ వ్యక్తి
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



నన్నూరులో దున్నేసిన కంది పంట

ఓర్వకల్లు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం.. హక్కు పత్రాల కోసం ఎంతో కాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఓ వ్యక్తి మేము సాగు చేసిన కంది పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని శనివారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలం లోని నన్నూరు గ్రామ సర్వే నెంబరు 1292లో 22.32 సెంట్లు, అదే సర్వే నెంబరులో 7.50 ఎకరాల్లో గ్రామానికి చెందిన అగుట లక్ష్మీదేవి, అగుట శంకరమ్మ, బొల్లవరం బాలమ్మ దాదాపు 70 సంవత్సరాల నుంచి పంటలు సాగు చేసు కుంటున్నట్లు వారు తెలిపారు. సాగు ధ్రువీకరణ పత్రాల కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇతరులకు తప్పుడు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం ఇచ్చారని లక్ష్మీదేవి, శంకరమ్మ, బాలమ్మ ఆరోపించారు. తమ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని, రికార్డులు మార్చాలని రెవెన్యూ అధికా రులకు ఎన్నిసార్లు విన్నవించానా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో బనగానపల్లెకు చెందిన ఓ వ్యక్తి తమ భూమిని తాను కొనుగోలు చేశానంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తమ పొలంలో సాగు చేసిన కంది పంటను ట్రాక్టర్లతో దౌర్జన్యంగా దున్నేశాడన్నారు. ఈ విషయంపై బాధిత రైతులు ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సునీల్ కుమార్‌ను వివరణ కోరగా బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, తహసీల్దార్‌తో చర్చించి రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఉయ్యాలవాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి మహేశ్వరి(29) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రామిరెడ్డి శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... మహేశ్వరి కొంత కాలంగా కుడుపునొప్పితో బాధపడుతూ ఉదయం ఇంటి వద్ద ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి అంకాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఆరు నెలల కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి..

మిడుతూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో ఓ వృద్ధుడు వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన నాగేశ్వర రెడ్డి(79) శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రోళ్లపాడు అభయారణ్యంలోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో నాగేశ్వర రెడ్డి వేపచెట్టుకు తాడుతో ఉరివేసుకున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడు నరాలబల హీనతతో బాధపడేవాడని, వ్యాధి తీవ్రత ఎక్కువకావడంతో భరించలేక మృతి చెందినట్లు మృతుడి కుమారుడు రామ్మోహన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

తప్పుడు కేసులతో భయపెట్టలేరు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సబ్‌జైలు ఎదుట ఎమ్మెల్యే అఖిల ప్రియ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో భయపెట్టలేరని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమపై, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వారికి లొంగిపోవాలని ఒత్తిడి చేశారని, అయినా భయపడలేదన్నారు. కార్యకర్తల పోరాటం ఫలితంగా మళ్లీ ఎన్నికల్లో గెలిచామమన్నారు. శనివారం కర్నూలు నగరంలోని మహిళా సబ్‌జైలును ఆమె సందర్శించారు. అక్కడ రక్షిత మంచినీటి ప్లాంటు, రెండు టీవీలను ఉచితంగా అందజేశారు. ఉప కారాగారం పరిసరాల్లో సీసీ రహదారి కోసం విన్నవించారని, దాన్ని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో తనను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు కూడా ఇదే కారాగారంలో ఉంచారని, ఇక్కడి సమస్యలు, పరిస్థితులు, అవసరాలను గుర్తించి వారికి సాయం చేశానని గుర్తు చేశారు. తప్పుడు కేసుల మూలంగా తాను సంవత్సరం బిడ్డను ఇంటి వద్ద వదిలి ఎంతో మానసిక క్షోభను అనుభవించానన్నారు. ఈ విషయం ఎన్నటికీ మర్చిపోనన్నారు. అధికారంలో ఉన్నా గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డవారు ఎవరూ వాటిని విస్మరించరాదని, అక్రమార్కులపై పోరాటాన్ని అలాగే కొనసాగించాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకుడు భైరెడ్డి సిద్ధార్థరెడ్డి రీల్స్ రాజకీయాలకు సరిపోతాడే తప్ప, రియల్ రాజకీయాలకు పనికిరారన్నారు. ఆయన మాటకారితనం, ప్రత్యేక యాసతో మాట్లాడటమే రాజకీయమని భ్రమ పడుతున్నారని అఖిలప్రియ ఎద్దేవా చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయి కాబట్టే ప్రతిపక్ష పార్టీ నామినేషను వేసిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బయటికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు కాబట్టే పులివెందులలో ప్రతిపక్ష పార్టీకి డిపాజిట్ గల్లంతైందని అఖిలప్రియ అన్నారు. ఈ కార్యక్రమాలో టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుతో పాటు కాడెద్దులు మృతి

- కుటుంబంలో విషాదం



మృతి చెందిన ఎద్దులను చూపుతున్న రైతులు



భార్యతో హుసేన్‌బాషా (ఫైల్)

రుద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధారిత కుటుంబమది.. కుటుంబ యజమానితో పాటు తన కాడెద్దులు కష్టపడితేనే గాని ఆ కుటుంబానికి జీవనం ఉండదు. అలాంటిది ఆ కుటుంబ యజమానితో పాటు తన రెండు ఎద్దులు మృత్యువాత పడిన దుర్ఘటన శనివారం రుద్రవరం మండలం ఆలమూరులో చోటుచేసుకుంది. దీంతో ఆ కుటుంబం, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇవీ.. ఆలమూరు గ్రామానికి చెందిన గోవిందిన్నె ఉహుసేన్‌బాషా (42) చెరువు పక్కనే ఉన్న తన పొలంలో వరి నాటేందుకు మడక దున్నాడు. ఎద్దులకు మట్టి అంటడంతో పై కడిగేందుకు చెరువులోకి తోలుకెళ్లాడు. చెరువులో ఎద్దులు కాస్త ముందుకెళ్లాయి. అక్కడ గుంతలో పడటంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. టైర్ల బండి గుంతలో పడడంతో బండిపై ఉన్న రైతు నీట మునిగి ఈత రాకపోవడంతో మృత్యువాతపడ్డాడు. హుసేన్‌బాషాకు చెందిన కాడెద్దులు నీటిలో మునిగి చనిపోయాయి. ఇవి సుమారు రూ.2లక్షలు విలువ చేస్తాయని స్థానికులు తెలిపారు.

రైతు కుటుంబంలో విషాదం

గోవిందిన్నె హుసేన్‌బాషాకు భార్య షకీలాపర్వీన్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్దమ్మాయికి వివాహమైంది. ఆషియా అనే రెండో అమ్మాయి ఇంటర్, కుమారుడు సద్దాం 8వ తరగతి చదువుతున్నాడు. భార్య పర్వీన్, బిడ్డలు విషాదంలో మునిగారు. యజమాని మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుని భార్య షకీలా పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు. ప్రమాద స్థలాన్ని సందర్శించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

ప్రమాదానికి ఆ గుంతే కారణం

ఆలమూరు చీలబోయిన చెరువులో అక్రమంగా మట్టి రవాణా చేయకుండా దారికి అడ్డంగా చెరువు గట్టు సమీపంలో అధికారులు గుంత తవ్వారు. ఆ గుంతే రైతుకు శాపంగా మారిందని గ్రామస్థులు తెలిపారు.

తానా చేయూతతో కప్పట్రాళ్ల విద్యార్థినికి ర్యాంకు

- ఉన్నత చదువుకు పొట్లూరి రవి సహాయం



తానా ప్రతినిధులతో కప్పట్రాళ్ల విద్యార్థిని షైమూన్

దేవనకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధికి, మహిళల స్వయం ఉపాధికి, విద్యార్థుల చదువుకు సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన షైమూన్ ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసానికి ఆయన రూ.1.75 లక్షల సహాయం అందించి ప్రైవేట్ రెసిడెన్షియల్ కాలేజీలో చదివించారు. రవి ప్రోత్సాహంతో ఆమె నేడు ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చాటడంతో పాటు ఏపీ ఈఏపీ సెట్‌లో 6,947 ర్యాంక్ సాధించి వెటర్నరీ కాలేజీలో స్థానం సాధించింది. దీంతో షైమూన్‌ను శనివారం కర్నూలులో జరిగిన కార్యక్రమంలో రవి అభినందించారు. షైమూన్ మాట్లాడుతూ రవి సహాయం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జగదీష్ రెడ్డి అనుముల, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ముప్పా రాజశేఖర్, ఏవో అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కౌలూరు సర్పంచ్‌కు అరుదైన గౌరవం

పాణ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం కౌలూరు సర్పంచ్ ఊడల బాలయ్య కేంద్ర జలశక్తి అధికారుల నుంచి అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ముద్రించిన వాయిస్ ఆఫ్ ఛేంజ్ పుస్తకంలో కౌలూరు గురించి వ్యాసాన్ని ముద్రించారు. తాగునీరు, పారిశుధ్యం, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దినందుకు పురస్కారం లభించినట్లు శనివారం సర్పంచ్ బాలయ్య తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ బాలయ్య

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి

ప్యాపిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లింది. స్థానిక కిందిగేరికి చెందిన బాలచంద్రుడు కల్లందొడ్డిలో గొర్రె పిల్లలను వదిలాడు. ఎవరూ లేని సమయంలో కుక్కలు కల్లం దొడ్డిలోకి వెళ్లి గొర్రె పిల్లలపై దాడి చేశారు. ఈ దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మావోయిస్టు నేత చిన్నన్నకు విప్లవ వీడ్కోలు

- కమ్యూనిస్టు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు
- తరలివచ్చిన మాజీ నక్సల్స్, అమరవీరుల, బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు
- మఫ్టీలో వడ్లరామాపురం చేరుకున్న పోలీసులు
- అంత్యక్రియలకు హాజరైన వారి వివరాల సేకరణ?



విప్లవ జోహార్లు అర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు



గ్రామంలో ఊరేగింపు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చౌకీ జిల్లాలో గల రాజ్‌నంద్‌గావ్- కాంగేర్ సరిహద్దులో మూడు రోజుల క్రితం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు నేత సుగులూరు చిన్నన్న అలియాస్ విజయ్‌కుమార్ అంత్యక్రియలు విప్లవ వీడ్కోలు నడుమ సాగాయి. శనివారం ఉదయం 11గంటల సమయంలో ఆయన మృతదేహం స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామానికి చేరుకుంది. అప్పటికే గ్రామానికి మాజీ మావోయిస్టులు, విరసం సభ్యులు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు, మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, జనశక్తి, పౌరహక్కుల సంఘం ప్రతినిధులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. చిన్నన్న మృతదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. ఎర్రజెండాలతో కవాతు నడుమ ఆయన మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామశివారులోని ఆయన సొంత పొలంలో కమ్యూనిస్టు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను పూర్తిచేశారు. ఈ సందర్భంగా పలువురు మావోయిస్టు నేత సుగులూరు చిన్నన్నతో తమకు ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ప్రత్యేకించి విప్లవ రచయితల సంఘం సభ్యుడు పినాకపాణి, న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహయ్య, జనశక్తి నేత సుంకన్న మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం నల్లమల ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక, అగ్రకుల అణచివేత, దళిత ఆత్మగౌరవ, ఫ్యాక్షనిజం, మహిళల వ్యక్తిత్వానికి సంబంధించి జరుగుతున్న విస్తృత స్థాయి పోరాటాల్లో జరిగాయన్నారు. అదేక్రమంలో భవనాశి దళం పేరిట జరిగిన అనేక రైతాంగ, భూస్వాధీన పోరాటాలు, అగ్రకులాల అన్యాయాలకు వ్యతిరేకంగా పీపుల్స్ వార్ ఉద్యమాలు జరిగిన సందర్భంలో ఒక మామూలు దళిత వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ చిన్నన్న విప్లవోద్యమం వైపు బాటలు వేశారని అన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రజా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఇదిలా వుంటే చిన్నన్న అంత్యక్రియల నేపథ్యంలో పలువురు పోలీసు అధికారులు మఫ్టీలో వడ్లరామాపురం గ్రామానికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన వివిధ ప్రజా సంఘాల నేతలు, మాజీ మావోయిస్టుల పేర్లను ఆరా తీసినట్లు తెలిసింది. సుగులూరు చిన్నన్నతో వారికి ఉన్న అనుభవాలను పంచుకున్న వ్యక్తుల వివరాలు, వ్యక్తుల ప్రసంగాలను సేకరించినట్లు సమాచారం. అంత్యక్రియల్లో హాజరైన వారిలో ప్రముఖ వైద్యులు నాగన్న, గోరీనాథ్, పద్మ, అంజమ్మ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



గోడపత్రికలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గోస్పాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో 20నుంచి 25వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్ అన్నారు. శనివారం గోస్పాడులో కార్యకర్తలతో కలిసి గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం పేదలు, బడుగు, బలహీనవర్గాల కోసం పాటుపడే సీపీఐ పార్టీకి ప్రజలు అండదండగా నిలవాలన్నారు. మహాసభలకు విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయులు, స్కీం వర్కర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిలానిబాషా, మౌల, నరసింహ, నాగరాజు, వెంకటేశ్వర్లు, గౌతమ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వారు ఎలా కొనసాగుతారు?



మాట్లాడుతున్న వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి

నందికొట్కూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో నిత్యాన్నదానం చేస్తున్న వడ్డెర సత్రం చైర్మన్‌గా తెలంగాణకు చెందిన వ్యక్తి ఎలా కొనసాగుతారని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి ప్రశ్నించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయాక శ్రీశైలం దేవస్థానంలో ఉన్న వడ్డెర కులస్తులంతా కలిసి ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన సత్రానికి చైర్మన్‌గా జరుపటి రాముడు అక్రమంగా కొనసాగుతున్నారన్నారు. రాముడు స్వచ్ఛందంగా చైర్మన్ పదవి నుంచి తొలగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు చక్రధర్, టీడీపీ వడ్డెర సాధికర సమితి ప్రధాన కార్యదర్శి సంపంగి రవి, వడ్డెర సంఘం నాయకులు నందికొట్కూరు తాలుకా అధ్యక్షులు శివమణి, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, మధు, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి యూటీఎఫ్ సాయం



ఉపాధ్యాయుడు రవికుమార్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండలం చింతకుంట్లలో పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఉపాధ్యాయుడికి యూటీఎఫ్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఉపాధ్యాయుడు రవికుమార్ అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం రూ.50లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. అంత డబ్బు లేక చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉండడాన్ని గుర్తించిన యూటీఎఫ్ నాయకులు అధ్యక్షులు పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో వారి నివాసానికి చేరుకుని రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, లతీఫ్, మదనగోపాల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నందికొట్కూరు వాసి

నందికొట్కూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ డా.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆగస్టు 15న పదో తరగతిలో రాష్ట్రంలో 599 మార్కులతో రెండో ర్యాంక్ సాధించిన నందికొట్కూరువాసి ఇస్రత్‌కు అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న షేక్ ఇస్రత్ తండ్రి అహ్మద్ రఫి నంద్యాలలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న కొత్తపల్లి డీటీ పెద్దన్న

కొత్తపల్లి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న 7వ సారి ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని నంద్యాలలో పరేడ్ మైదానంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గనియా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ చేతుల మీదుగా డీటీ పెద్దన్న ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శనివారం డీటీ పెద్దన్న మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు తాను చేసిన సేవలను గుర్తించి 7వ సారి ప్రశంసాపత్రం అందుకోవడం వల్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి

జిల్లాలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించి, విశేష పూజలు చేపట్టారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో ఆకట్టుకున్నారు. అలాగే వేషాధారణ చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ.. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంలాంటివని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు.



మిడుతూరులో ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీకృష్ణుడు



మహానంది మండలం గోపవరంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



బొమ్మలసత్రం సాయిబాబా గుడిలోని శ్రీకృష్ణ మందిరంలో పూజలు



కరివేనలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పద్మావతీనగర్‌లో శ్రీకృష్ణుడికి అభిషేకం



వెలుగోడులో...



కొత్తపల్లిలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువకులు

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్





నంద్యాల శ్రీకృష్ణ మందిరంలో పూజలు




ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణ బలరాములు



జూపాడుబంగ్లాలో...



నందికొట్కూరులో...





గడివేములలో...



గోస్పాడులోని వేణుగోపాల స్వామి ఆలయంలో..



నంద్యాలలోని రవీంద్ర హైస్కూల్‌లో...



చిత్తలూరివారి వీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణభగవానుడు

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రైతు ఉద్యమ నాయకుడు డాక్టర్ గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ లచ్చన్న పేద ప్రజల పక్షపాతి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. రైతు సంక్షేమం, కూలీల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు సూర్యమౌళి, మోహన్‌రెడ్డి, పీజీఆర్ఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాద్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎంపీ



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎడాదిలోనే మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చడం జరిగిందన్నారు.

బాలిక అదృశ్యం

బండిఆత్మకూరు ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండలంలో జీ లింగాపురం గ్రామంలో 17 సంవత్సరాల బాలిక ఆదృశ్యమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయిందని, ఇంతవరకు తిరిగి రాకపోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

ఇరువురికి గాయాలు

మండంలోని పెద్దదేవళాపురం గ్రామ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయాలపాలైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. శనివారం నంద్యాల నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు, ఆత్మకూరు వైపు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కార్లు ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో కోటమ్మ, మరో మహిళకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి పరేడ్‌లో పాణ్యం విద్యార్థులు



పాణ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా శుక్రవారం విజయవాడలో జరిగిన పరేడ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కవాతులో పాణ్యం మోడల్ పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ దినేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఆహ్వానం మేరకు పాఠశాలకు చెందిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ బాలుర దళానికి చెందిన మాస్టర్ కెవి వంశీదర్, షెక్షావలిని రాష్ట్ర స్థాయికి పంపడం జరిగిందన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో విద్యార్థులు పాల్గొనడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థుల ఉత్తమ ప్రదర్శనకు గాను సీఎం, విద్యా మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. వాజ్‌పేయి దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైప చెరువులో నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లును సీఐ మంజునాథరెడ్డి, గణేశ్ కమిటీ గౌరవ సలహాదారుడు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి పరిశీలించారు. ఈనెల 27న వినా యక విగ్రహాలను ప్రతిష్ఠించి 31న నిమజ్జనం చేయనున్నారు. ఈ సందర్భంగా టంగుటూరు శ్రీనయ్య, సీఐ మంజునాథరెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం సజావుగా సాగేందుకు ముందుగానే ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ ఇందిరమ్మ మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తూ మట్టివిగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. టీచర్ నాగరాజు, న్యాయవాది నాగేంద్రారెడ్డి, కోడినగేశ్‌కుమార్, బండి వెంకటేశ్, ఖాదర్ పాల్గొన్నారు.

అనుబంధ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయిలో జరుగుతున్న అనుబంధ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జయసూర్య, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు దేవెల్ల మురళి నాయకులను కోరారు. శనివారం మండలంలోని అల్లూరు గ్రామంలో నంద్యాల జిల్లా టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి నివాసంలో మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో అన్ని అనుబంధ కమిటీలు చురుగ్గా పనిచేసేవిధంగా తయారు చేయాలని, అందులో యాక్టీవ్‌గా ఉన్న వారికి చోటు కల్పించి కమిటీలను త్వరిత గతిన పూర్తి చేయాలని నాయకులకు వారు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాకులు మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, రవీంద్రారెడ్డి, మహేశ్వ రెడ్డి, మీనాక్షీదేవి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గురురాజాకు రాష్ట్రస్థాయి అకాడమిక్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న షేక్షావలి రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అకడమిక్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ అవార్డు - 2025 అందుకున్నారు. ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు తులసీ విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో చీరాలలో నిర్వహించిన కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్యయాదవ్, రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో వైపీఎస్ నర్సిరెడ్డి 597 మార్కులు, తిరుమలేశ్వరరెడ్డి 595 మార్కులు అలాగే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చూపిస్తున్న ప్రతిభకు తమకు ఈ అవార్డు దక్కిందన్నారు. అవార్డు సాధించిన షేక్షావలిరెడ్డిని గురురాఘవేంద్రా విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరక్టర్ మౌలాలిరెడ్డి అభినందించగా పాఠశాల ఏవో సుబ్బారావుతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అసంపూర్తిగా పనులు

ఇబ్బంది పడుతున్న కేజీబీవీ విద్యార్థినులు



పాఠశాల ఆవరణలో అసంపూర్తగా బేస్‌మెంట్ గుంత

పాములపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పాములపాడు కేజీబీవీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. బాత్‌రూమ్‌ల డోర్లు, చౌకట్లు, మినరల్ వాటర్ ప్లాంటు మరమ్మతులు, డ్రైనేజి పైప్‌లైన్, సెప్టింక్ ట్యాంక్ నిర్మాణం లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.11 లక్షలు మంజూరు చేసింది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. బాత్‌రూములు అధ్వానంగా ఉండడంతో స్నానాలు చేసేందుకు విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఈ పనులు పాఠశాల తెరవకముందే పూర్తి కావాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

కష్టం.. నష్టం

1500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

పాములపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు 1500 వందల ఎకరాలలో వరద నీరు నిలిచి పంటలు కుళ్లిపోయాయి. మండలంలోని ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగుకు దగ్గరగా తెలుగుగంగ ఉంది. ఈ భవనాశి వాగు నీరు పాములపాడు మీదుగా ప్రవహించి జూపాడుబంగ్లా మండలంలోని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద కలుస్తాయి. అయితే తెలుగుగంగ విస్తరణ పనుల్లో కొంతమేర వాగును పూడ్చేశారు. దీంతో వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద వెళ్లేందుకు లేక సమీపంలోని పంటల్లోకి ప్రవహించడంతో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాములపాడు, ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగు పరివాహక ప్రాంతంలోని దాదాపు 1500 ఎకరాల్లో మొక్కజొన్న పంట మునిగిపోయి కుళ్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లక్షల రూపాయలు నష్టపోయామని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



గుర్రపు డెక్కతో నిండిపోయిన కుంట



గుర్రపు డెక్కతో నిండిపోయిన కుంట

కొత్తపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పై చిత్రంలో పచ్చగా కనిపిస్తున్న ఏదో పంట పొలం అనుకుంటే పప్పులో కాలేసినట్లే... ఇది కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామం నడిబొడ్డున ఉన్న 'నంది'కుంట. గ్రామంలోని శివాలయం పక్కనే పూర్వం సుమారు 3 ఎకరాల్లో గ్రామస్థుల సాగు, తాగునీటితో పాటు శివాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఓ కుంటను నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంట నిండా గుర్రపుడెక్కలతో నిండిపోయి కుంటలోకి కాలు పెట్టడానికి కూడా వీల్లేకుండా పోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సమీపంలో ఉన్న నల్లమల ప్రాంతం నుంచి వస్తున్న వరద కుంటలోకి వచ్చి చేరుతుండటంతో గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. దీంతో వర్షం నీరంతా గ్రామంలోని రహదారులపై మోకాళ్లోతుగా ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కుంటలోని గుర్రపు డెక్కను తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు.

దిష్టిబొమ్మలా వాటర్ ట్యాంకు

పాణ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చెంచు విద్యార్థులకు తాగునీరందించడానికి నిర్మించిన వాటర్ ట్యాంకు చుక్కనీరు అందించడం లేదు. పాణ్యం మండలం బలపనూరు పరిధిలోని ఏపి గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల వద్ద 2005లో ఐటీడీఏ శ్రీశైలం ఆధ్వర్యంలో కళాశాల బాలికలకు తాగునీరందించేందుకు ఈ ట్యాంకు నిర్మించారు. ట్యాంకుకు పైపులైను ఏర్పాటు చేయకపోవడంతో ట్యాంకు దిష్టిబొమ్మలా మారిపోయింది. బాలికలు సమీప మినీగురుకుల పాఠశాల బోరునుంచి పైపులైను వేసుకొని తాగునీరు వాడుకుంటున్నారు. బాలికలు హాస్టల్‌లో తాగునీటి సమస్య వేధిస్తోంది. దీనిపై ఐటీడీఏ అధికారులను వివరణ కోరాలని ప్రయత్నించగా అందుబాటులో లేరు.



నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా చెన్నకేశవుడి పల్లకోత్సవం



చెన్నకేశవ ఉత్సవమూర్తులతో ఊరేగింపు

చాగలమర్రి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తుల పల్లకోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం శ్రావణమాసం కావడంతో వేద పండితుల ఆధ్వర్యంలో చెన్నకేశవ, సంజీవరాయ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి, ఆలయ ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే మూడురాళ్లపల్లె గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తుల పల్లకి ఉత్సవం చేశారు. శెట్టివీడులో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక కుంకుమార్చనలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితులు రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు, పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ కో.కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిల్ప కలలకు ప్రాణం పోసిన వీరాచారి

ఆళ్లగడ్డ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శిల్ప కలలకు దురుగడ్డ బాలవీరాచారి ప్రాణం పోశారని ప్రొఫెసర్ ఆదినారాయణ, ప్రముఖ శిల్పి దురుగడ్డ హరిప్రసాద్ ఆచారి కొనియాడారు. శనివారం స్థానిక శారద శిల్ప కళామందిరంలో ప్రముఖ శిల్పి ఉత్తమ అవార్డు గ్రహీత బాలవీరాచారి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగన్న, దురుగడ్డ హరిప్రసాద్, దురుగడ్డ రవీంద్రాచారి, సావిత్రమ్మ, భవనేశ్వరీ, లలిత కళాసమితి అధ్యక్షుడు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, రామాచారి, సుబ్బారావు స్వామి పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైప చెరువులో నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లును సీఐ మంజునాథరెడ్డి, గణేశ్ కమిటీ గౌరవ సలహాదారుడు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి పరిశీలించారు. ఈనెల 27న వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి 31న నిమజ్జనం చేయనున్నారు. ఈ సందర్భంగా టంగుటూరు శ్రీనయ్య, సీఐ మంజునాథరెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం సజావుగా సాగేందుకు ముందుగానే ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ ఇందిరమ్మ మట్టి విగ్రహాలను ప్రోత్సహిస్తూ మట్టివిగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీచర్ నాగరాజు, న్యాయవాది నాగేంద్రారెడ్డి, కోడినగేశ్‌కుమార్, బండి వెంకటేశ్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

పలుకూరు వాసికి భారతసేవారత్న అవార్డు

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారికి భారతసేవా రత్న అవార్డు వచ్చింది. శనివారం హైదరాబాద్ సిటీ కల్చర్ ఫంక్షన్ హాల్‌లో సినీనటుడు పృథ్వీ, హీరోయిన్ సిరి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ పౌండేషన్ అధ్యక్షుడు లాయర్ చక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతులచ్చన్న జయంతి

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జి.హరినాథ్‌గౌడ్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నా రన్నారు. సంఘ సంస్కరణ ఉద్యమాల్లో పాల్గొని వెనుకబడ్డ కులాలవారికి ఎనలేని సేవలందించారన్నారు. ఆయన సేవలను మరువరానివన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యుడు వెంకటేశ్వరు (దేవుడు), వెంకటరమణ గౌడ్, సంజీవగౌడ్, నరసింహగౌడ్, శ్రీనివాసగౌడ్, నరసయ్య గౌడ్ రాముడు గౌడ్, రామసుబ్బయ్య, నాగరాజు, మానన్న, పుల్లయ్యర, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల మహాసభలు విజయవంతం చేయాలని ఏపీ ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిని కోరారు. శనివారం బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదిలక్ష్మి, సీపీఐ అనుబంధ సంఘం నాయకులు సుంకయ్య, శివబాలకృష్ణ, అబ్బాస్, రమీజా, వేదవతి, శ్రీనివాసులు, లక్ష్మి గురమ్మ, లక్ష్మదేవి, మహాలక్ష్మి, పష్పవతి, ప్రమీల పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి

● చైర్మన్ వెంకటేశ్వరమ్మ

దొర్నిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం సహకార సంఘ సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ కుమ్మిత వెంకటేశ్వరమ్మ అన్నారు. శనివారం కొండాపురం సొసైటీ ఆవరణలో సీఈవో ఎంఎస్‌కే బేగ్ అధ్యక్షతన సొసైటీ చైర్మన్‌గా వెంకటేశ్వరమ్మ, డైరెక్టర్లుగా పగిడెల శివశంకర్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నాయకులు చవ్వ శివకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సాగు నీటి సంఘం అధ్యక్షుడు నాగలింగేశ్వర్‌రెడ్డి, అంకిరెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది ఆనంద్‌రెడ్డి, జమాల్, శివకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కేవీ కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివుడు పాల్గొన్నారు.

శ్రామిక పీడిత జన సంరక్షణే జనసేవాదళ్ లక్ష్యం

● సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

బేతంచెర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రామిక పీడిత జన సంరక్షణే జనసేవాదళ్ లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ అరుణ పతాకావిష్కరణను సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలు నగరంలో ఆగస్టు 23 నుంచి 25వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.నాయకులు బాబా ఫకృద్దీన్, మోట రాముడు, కే.రాధాకృష్ణ, ఎం.రమేష్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఆరుగురికిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్ రఫీ శనివారం తెలిపారు. ఇంటి విషయంలో మాట మాటా పెరిగి రుద్రవరం గ్రామానికి చెందిన భైరి బ్రహ్మం అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేశారు. బాధితుడు భైరి బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు భైరి శ్రీహరి, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముకుందా..ముకుందా..

● వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
● వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ముకుందా.. ముకుందా.. కృష్ణా.. ముకుందా.. ముకుందా.. అంటూ శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంతం ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మీర్జాపురం, కొలిమిగుండ్ల, బందార్లపల్లె గ్రామాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించారు. నాయినిపల్లె గ్రామంలో ఆ సంస్థ సభ్యులు రవి, చిన్నయ్య, మోహన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమ ను ప్రత్యేక పల్లకీలో ఉంచి, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మండలంలోని బెలుం గ్రామం శ్రీకృష్ణ మందిరంలో బాచం వెంకటశివారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అన్న దానం గ్రామోత్సవం నిర్వహించారు. రామాపురం విశ్వతేజ పాఠశాల విద్యార్థుల కోలాటం, నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించారు. ఇటిక్యాల, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె గీతాశ్రమం నందు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

అవుకు : పట్టణంలోని యాదవ వీధిలో వెలసిన శ్రీకృష్ణుడు ఆలయంలో అర్చకులు స్వామి వారిని పూలమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద స్తంభం పాకుట, ఉట్ల పోటీలు నిర్వహించి విజేతలకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదవులంతా కలిసి శ్రీకృష్ణుని ఊరేగింపు నిర్వహిస్తూ పాతబస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఉట్టీలు కొడుతూ, బాజా భజంత్రీల మధ్య, కోలాటాలు ఆడుతూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో యాదవ కులస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గీతాపారాయణం చేశారు. భారతీ విద్యామందిరానికి చెందిన విద్యార్థుల కోలాటం అందరిని ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడి విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, కమిటీ సభ్యులు, హిందూ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో సరస్వతి శిశుమందిరం విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండల కేంద్రంలో యాదవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంకాలమ్మ గుడి ఆవరణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఇంద్రగంటి లక్ష్మీకాంత్‌శర్మ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉయ్యాలవాడ: వేణుగోపాలస్వామి ఆశ్రమంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సుబ్బారెడ్డి స్వామి శిష్యులు కృష్ణుడికి అభిషేకం అలంకరణ చేసి పూలమాలల తో ప్రత్యేకంగా అలంకరించారు.

సంజామల: పేరుసోమలలోని చెన్నకేశవ స్వామి, సంజామలలోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం గ్రామ సంఘం పెద్దలు రఘురామయ్య, పులిరాజారెడ్డి ఆధ్వర్యంలో యువకులకు ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. రాత్రి చెక్కభజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న బృందావనం వేణుగోపాల స్వామి మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గోపాలకృష్ణ బృందావనం ఆలయ కమిటీ చైర్మన్ గూండా జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు శ్రీరాధాకృష్ణ వేషాధారణ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతులు అందజేశారు. అలాగే సరస్వతి శిశు మందిర్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



డోన్‌లో శ్రీకృష్ణుడి విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవ కులస్థులు, టీడీపీ నాయకులు, వై.నాగేశ్వరరావు యాదవ్



మీర్జాపురంలో శ్రీకృష్ణుడి వద్ద పూజలు చేస్తున్న మహిళలు



నాయినిపల్లెలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



యనకండ్ల శ్రీకృష్ణాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ



సంజామలలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి



చాగలమర్రిలో స్వామివారి గ్రామోత్సవం



డోన్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు





దొర్నిపాడు, ఉయ్యాలవాడలో ..



రుద్రవరం: ఇస్కాన్ దేవాలయంలో పూజలందుకున్న రాధాకృష్ణులు

పేదల పక్షపాతి కోట్ల విజయభాస్కర్ రెడ్డి

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి
● ఘనంగా దివంగత మాజీ సీఎం 105వ జయంతి

డోన్ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి అని.. పేదల గుండెల్లో నిలిచారనీ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కొనియాడారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి 105వ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని జడ్పీ జిల్లా పరిషత్ గెస్టు హౌస్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కోట్ల, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఎన్నో పథకాలు అందించి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, విజయభట్టు, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇంతియాజ్ బాషా, పీఏసీఎస్ చైర్మన్ చిన్న పూజర్ల ఎల్లగౌడు, టి.శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోట్ల జయంతి సందర్భంగా రైల్వే సుబాన్, అజీజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు నగదు పురస్కారం అందజేశారు.

● పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, కోట్ల అభిమానులు రక్తదానం చేశారు.

● నియోజకవర్గంలోని టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు, బూత్ ఇన్‌చార్జిలకు ఎమ్మెల్యే కోట్ల ప్రశంసాపత్రాలు అందజేశారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.25,61,419ల ఎల్‌వోసీలను బాధితులకు ఎమ్మెల్యే కోట్ల అందజేశారు.

ప్యాపిలి : పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కోట్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. నాయకులు రాజా నారాయణమూర్తి, ఖాజా పీర్, మధు, చల్లా వీరాంజనేయులు, సుదర్శన్, రామ్మోహన్‌యాదవ్, గండికోట పెద్దరామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం కోట్లకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే, నాయకులు

పేదల పాలిట కల్పవల్లి

● మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
● బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీల అందజేత

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదల పాలిట కల్పవల్లి సీఎం రిలీఫ్ ఫండ్ అని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 20మంది బాధితులకు మంజూరు అయిన రూ.31.5 లక్షల విలువగల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే అత్యావసర వైద్యసేవల నిమిత్తం లెటర్‌ఆఫ్ క్రెడిట్ కింద రూ.13లక్షలు విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. చెక్కులు అందించిన బీసీ జనార్దన్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి బాధిత టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున నలుగురికి రూ.20లక్షల బీమా సొమ్ము ను మంత్రి బీసీ శనివారం అందించారు.

● బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్‌లో కార్మిక బీమా కోసం పేర్లు నమోదు చేయించుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్మిక బీమా పథకంలో పేరు నమోదు చేసుకున్న సయ్యద్ హఫీజ్‌కు ఆర్థిక సాయం అందించారు.



ఎల్‌వోసీలను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పట్టలేని ఆనందం


● ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలు ..
● ఆర్థిక భారం తగ్గిందని హర్షం

చాగలమర్రి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం(స్త్రీ శక్తి) హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసింది. నిన్నటి వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలంటే పేద, మధ్యతరగతి మహిళకు భారంగా ఉండేది. ఎన్నికల హామీల్లో భాగంగా ఉచిత బస్సు పథకం కూటమి ప్రభుత్వం అమలు చేసిందని మహిళలు, బాలికలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చాగలమర్రిలో బస్సు ఎక్కుతున్న మహిళలు

ఆర్థిక భారం తగ్గింది



గతంలో అమ్మ, మేము కలిసి కర్నూలుకు వెళ్లి తిరిగి రావాలంటే రూ.1,060 ఖర్చు అయ్యేది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సదుపాయం కల్పించ డంతో ఖర్చు తగ్గింది. మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడం హర్షనీయం.

● రజిని, వందన, ప్రయాణికులు, కడప

చాలా బాగుంది



కడప నుంచి కర్నూలుకు వెళ్తున్నా. ఆర్టీసీలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చాలా బా గుంది. జీవితంలో తొలిసారి డబ్బులు లేకుండా ప్రయాణం చేయడం హ్యాపీగా ఉంది.

● సుకన్య, దీపిక, ప్రయాణికులు, కర్నూలు

మహిళలకు ప్రయోజనం



మహిళలు, బాలికలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం కృషి చేయడం ఆనందంగా ఉంది. చార్జి తక్కువగా ఉంటుందని గతంలో ఆర్డీనరి సర్వీసు వచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చేది. నేడు ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కిన ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. మహిళలకు ఎంతో ప్రయోజనం.

- విజయలక్ష్మి, ప్రయాణికురాలు

పేదలకు ఉపయోగం



ప్రభుత్వం ఉచితంగా మహిళలకు ప్రయాణం ప్రవేశ పెట్టడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం మాట నిలబెట్టుకున్నారు. స్త్రీశక్తి పథకం మధ్యతరగతి మహిళలకు ఎంతో ఉపయోగకరం.

- నాగలక్ష్మి, నంద్యాల

చాగలమర్రిలో కుండపోత వర్షం

చాగలమర్రి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. 13.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రహదారులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. మట్టిమిద్దెల్లో నివసించేవారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

దెబ్బతిన్న పంటలు

రుద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూడురోజుల నుంచి మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముత్తలూరు, పేరూరు, చిలకలూరు, ఎర్రగుడిదిన్నె గ్రామాల రైతులు మినుము పంట సాగు చేశారు. వర్షాలకు పంట దెబ్బతిందని రైతులు వాపోయారు. అలాగే కొండమాయపల్లెలో వరి పంట దెబ్బతిన్నది. మళ్లల్లో నీరు నిలిచి నారు కూలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదానం ప్రారంభం

చాగలమర్రి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన సీతారామాలయం వద్ద శనివారం శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వాసాపురంలో ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురంలో వేంకటేశ్వరస్వామి, లక్ష్మిగోదాదేవి అమ్మవార్లకు, మానస లింగేశ్వరుడు, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మలు వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

20నుంచి పెద్దరాజు స్వామి ఉరుసు

బేతంచెర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో పెద్దరాజు స్వామి దర్గా ఉరుసు ఆహ్వానపత్రికను మాజీ ఆర్థిక మంత్రి బుగ్గ రాజేంద్రనాథ్ రెడ్డి దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి శనివారం అందజేశారు. ఈ నెల 20 నుంచి 22వరకు జరిగే ఉరుసుకు హాజరు కావాలని కోరారు.

'చలో ఢిల్లీ'కి బయలుదేరిన బీసీ నాయకులు

ప్యాపిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 18,19 తేదీల్లో బీసీ హక్కుల సాధన కోసం నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు శనివారం మండలం నుంచి పలువురు బీసీ నాయకులు బయలుదేరారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో బీసీలు రైలులో ఢిల్లీకి బయలుదేరివెళ్లారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి

ప్యాపిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్న రహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు కల్పించడం వలన ఆటో కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

డోన్ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని వెంకటనాయునిపల్లె సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు.. సూపర్ సిక్స్ అయ్యాయన్నారు. 'కూటమి'లో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

యాగంటిలో బీసీ ఇందిరమ్మ ప్రత్యేక పూజలు

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఆలయంలో ఉమామహేశ్వరస్వామికి బీసీ ఇందిరమ్మ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయంలో స్వామికి పూజలు చేశారు. అలాగే ఆలయంలో గోపూజ చేశారు. ఈవో పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి తదితరులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మౌళీశ్వరరెడ్డి, భరతుడు, సంగు శంఖేశ్వరరెడ్డి, బత్తుల నారాయణరెడ్డి, మల్లేశ్‌రెడ్డి, రామశేఖర్, మహేశ్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.